సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మహానగరంలో మట్టి రోడ్లు!



వెంకన్నపాలెంలో మట్టి రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

మల్కాపురం: ఆ గ్రామం గ్రేటర్ సిటీ పరిధిలో ఉన్నా నేటికీ ఆ ప్రాంత వాసులు మట్టి రోడ్డు పైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉందంటే ఆశ్చర్యకరం కదా..! ఇది నిజం. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కృష్ణ రెస్టారెంట్ అండ్ బార్ వెనుక మార్గం నుంచి వెంకన్నపాలేం ఈ మట్టిరోడ్డు గుండానే వెళ్లాలి. దీంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు బురదమయం కావడంతో ఈ ప్రాంత వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు,పాలకులు స్పందించి సీసీ లేదా,బీటీ మార్గం వేయించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌కు మద్దతుగా రాస్తారోకో

మల్కాపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ యత్నిస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆరోపించారు. ఈ అంశంపై మల్కాపురం వద్ద సోమవారం మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసి ఆయా సంస్థల్లో పని చేస్తున్న కార్మికులను రోడ్డు పడేయాలని కుట్ర చేస్తుందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వమే కొనసాగించాలనే డిమాండ్‌తో మంగళవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపడుతున్నట్టు వివరించారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చేపట్టే రాస్తారోకోలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి



కొండవాలు ప్రాంతాలను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ

పెదగంట్యాడ: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా ప్రాంతాలను పరిశీలించాలని ప్రభుత్వం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. ఇందులో భాగంగా సోమవారం ఆమె దయాల్ నగర్, గంగవరం ప్రాంతాల్లో పెదగంట్యాడ తహసీల్దార్ ఎల్. రామారావు, సచివాలయ సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షల కారణంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని, కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షపునీరు సాఫీగా సాగిపోయేలా జీవీఎంసీ ప్రజారోగ్య విభాగ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడ్మిన్ నరేష్ ఉన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

భయం.. భయం..

- కొండవాలు ప్రాంత ప్రజల్లో కలవరం
- 61వ వార్డులో కూలిన పెంకుటిల్లు
- హిమాచల్ నగర్‌లో కూలిన గోడ

వర్షాలతో కొండవాలు ప్రాంతాల ప్రజలు వణుకుతున్నారు. గత అనుభవాలతో పాటు వర్షం కురిసిన ప్రతిసారీ ఏదో ఒక చోట ఇళ్లు, రక్షణ గోడలు కూలడంతో భయం భయంగా జీవిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు అధికారులు, నాయకులు వచ్చి వెళ్లిపోతున్నారే తప్పా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు.



బాధితురాలికి సాయం అందిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ



59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో కూలిన గోడ

మల్కాపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 61వ వార్డుకు చెందిన డొక్కడ లక్ష్మి అనే మహిళకు చెందిన పెంకుటిల్లు ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఇంటి పైకప్పుతో సహా పక్కగోడలు కూలిపోయాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. వివరాలివి.. వార్డు పరిధిలోని మల్కాపురం, పల్లివీధిలో లక్ష్మి చిన్న కిరాణా దుకాణం నడుపుకొంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ఇటీవలే పెద్ద కుమార్తె వివాహం అయింది. వర్షాలు కావడంతో ఆదివారం రాత్రి చిన్న కుమార్తెను తీసుకుని పెద్ద అమ్మాయి ఇంటికి వెళ్లారు. తెల్లవారి వచ్చి చూసేసరికి ఇల్లు కూలిపోయి ఉండటంతో ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనలో ఆమె ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు వంటసామగ్రి, పిల్లల పుస్తకాలు, తినుబండారాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు సోమవారం ఉదయం వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ప్రభుత్వసాయం అందిస్తామని, ఇంటి నిర్మాణానికి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, టీఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు తదితరులున్నారు. అనంతరం ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి వచ్చి కూలిన ఇంటి పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వసాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేటర్ సాయం

బాధితురాలి లక్ష్మిని కార్పొరేటర్ కొణతాల సుధ సోమవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చట్టి నూకరాజుయాదవ్, బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన గోడ

వర్షాలకు 59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో గోడ కూలిపోయింది. వర్షాలకు మట్టి కరిగిపోయి ఇంటి ముందున్న గోడ కూలిపోవడంతో ఇంటికి వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో ఆ ఇంట్లో నివసిస్తున్న వారిని ములగాడ తహసీల్దారు కార్యాలయం సమీపంలోని పునరావాస కేంద్రానికి తరలించారు.

రిటైనింగ్ వాల్ నిర్మించాలి



రామకృష్ణానగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గోపాలపట్నం: రామకృష్ణానగర్ కొండవాలు ప్రాంతంలో కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని సోమవారం సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యులు పరిశీలించారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రమాద తీవ్రత పెరగకుండా తక్షణమే రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందిరానగర్, లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో కూడా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరెడ్డి, బలివాడ వెంకటరావు, గోవిందరావు, ఆర్ శ్రీనివాసరావు, నితిన్ పాల్గొన్నారు.



పెంకుటిల్లు కూలడంతో మట్టిలో కూరుకుపోయిన సామగ్రి



మల్కాపురం వద్ద బాధితురాలిని వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే గణబాబు

గణనాథుడికి ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. సోమవారం గణనాథుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శిరీష దంపతులు గణనాథుడికి విశేష పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సఆలయ ప్రాంగణంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శిరీష సహకారంతో ఏర్పాటు చేసిన వి. జగదీశ్వరి బృందం 'గాన మంజరి' భక్తులను ఓలలాడించింది. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ, వైస్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, సెక్రటరీ ఐ.వి.శంకరరావు, ట్రెజరర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వరి బృందం గానమంజరి

కార్పొరేటర్ బొమ్మిడికి పరామర్శ

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తండ్రి బొమ్మిడి అప్పలనాయుడు సోమవారం మృతి చెందారు. బుచ్చిరాజుపాలెంలోని స్వగృహంలో అప్పలనాయుడు భౌతికాయానికి ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు నివాళులర్పించారు. రమణను పరామర్శించారు.అలాగే కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్ల శ్రీనివాసరావు దాడి వెంకట రమేష్, గల్లా చిన్న, సరగడం రాజశేఖర్, బల్ల శ్రీనివాసరావు తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

వెళ్లి రా.. వినాయకా

- మొదలైన గణేశుడి నిమజ్జనాలు
- పలు మండపాల వద్ద విగ్రహాల నిమజ్జనం



వినాయకుడి నిమజ్జనానికి సిద్ధమైనచిన్నారులు

మల్కాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాల వద్ద గణనాథులను సోమవారం సాయంత్రం నిమజ్జనాలకు తీసుకు వెళ్లారు. మల్కాపురం వద్ద సాయి సమత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి మేళతాళాల నడుమ ఊరేగించి యారాడ తీరంలో నిమజ్జనం చేశారు.అలాగే మల్కాపురం, పల్లివీధి వద్ద పవన్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు.విజేతలకు సమతయాదవ్ బహుమతులు అందించారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ సెలక్షన్ టోర్నీ

గోపాలపట్నం: గోపాలపట్నం స్టూడెంట్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్-16 సెలక్షన్ టోర్నమెంట్ నిర్వహించారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ టోర్నీలో బాలుర విభాగంలో గోపాలపట్నం బాయ్స్ జట్టు మొదటి స్థానంలో నిలవగా, టి.అర్జాపురం రెండో స్థానంతో సరిపెట్టుకుంది. బాలికల విభాగంలో నునపర్తి బాలికలు మొదటి స్థానం దక్కించుకోగా, గోపాలపట్నం బాలికలు రెండో స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు పలువురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో గోపాలపట్నం హైస్కూల్ విదార్థులు వినయ్ ఈశ్వర్, సాయి కుమార్, గోపాలపట్నం బాలికల పాఠశాల నుంచి కీర్తన, సంజన, భవ్య, దుర్గ ఎంపియ్యారు.



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

సెయిల్‌లో విలీనంతోనే ఉక్కు మనుగడ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే మనుగడ సాధ్యమవుతుందని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాల నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్న డిమాండ్‌పై సోమవారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసి ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేశారు. కేంద్రం అంక్షలతో స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉపాధి పొందారన్నారు. ఆయా వర్గాల అభివృద్ధిని ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందని ఆరోపించారు. ఉత్పత్తిని గణనీయంగా తగ్గించడంతో పాటు ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇవ్వాలని కుట్ర చేస్తుందన్నారు. పీఎఫ్, ఎస్‌బీఎఫ్, త్రిఫ్ట్ సొసైటీలకు నిధులు జమ చేయకుండా ఆర్థికంగా దెబ్బతీస్తుందని మండిపడ్డారు. వెంటనే స్టీల్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడపడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, బి. అప్పారావు, ఎస్. శ్రీనివాసరావు, కాటం చంద్రరావు, యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, సురేష్‌బాబు, రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు

పూర్తి సామర్థ్యంతో నడపాలి

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు మాట్లాడుతూ ముడి సరకులు లేకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె. రామకృష్ణ, మసేనురావు, డి. అప్పారావు పాల్గొన్నారు.

ప్రైవేటుకు కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏడాదికి 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, ఎస్.రామారావు అన్నారు. అదే సెయిల్‌లో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి రూ.లక్ష కోట్లు పెట్టుబడికి సిద్ధంగా ఉండడం దారుణమని వాపోయారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో సోమవారం 1307వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2030 నాటికి 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించినా.. నేటికీ ప్రభుత్వ, ప్రైవేటు కర్మాగారాలు కలిపి 150 మిలియన్ టన్నుల ఉక్కును కూడా ఉత్పత్తి చేయలేని స్థితి ఉందన్నారు. సెయిల్ 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసిందని, పది మిలియన్ టన్నుల విస్తరణకు లక్ష కోట్లు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశం ఉందని, అయితే ముడి సరకులు అందివ్వకుండా సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ఇటువంటి కర్మాగారాన్ని ప్రైవేటు సంస్థకు అమ్మాలని చూడడం అవివేకమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న రాస్తారోకోలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, వై.టి.దాస్, డీసీహెచ్. వెంకటేశ్వరరావు, కె.వెంకట్రావు, యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీజీ సెట్ రిపోర్టింగ్ తేదీ పొడిగించాలి

విశాఖ సిటీ: ఏపీ పీజీ సెట్-2024లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామాల నుంచి విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని, అందుకే తేదీ పొడిగింపుపై ఆలోచించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంఘం నాయకులు పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్ ఉన్నారు.



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

మేహాద్రి గెడ్డతో ప్రమాదం లేదు

- దిగువ ప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మేహాద్రి రిజర్వాయర్ పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గోపాలపట్నం : మేహాద్రి గెడ్డ గేట్లు తెరిచే పరిస్థితి లేదని, దిగువ ప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మేహాద్రి గెడ్డ రిజర్వాయర్, కొత్తపాలెం, గోపాలపట్నంలో కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ మేహాద్రి గెడ్డ పూర్తిస్థాయి నీటిమట్టం 61 అడుగులు కాగా..నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 57.4 అడుగులకు నీటిమట్టం చేరిందన్నారు. సోమవారం ఉదయం నుంచి వర్షం కురవకపోవడంతో ప్రమాదం నుంచి గట్టెక్కినట్టేనన్నారు. రిజర్వాయర్‌కు ఆరు గేట్లు ఉండగా 4 గేట్లు ఎత్తి నీటి విడుదలకు ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ జలాశయం నీటిని పూర్తి స్థాయిలో తాగునీటికి వినియోగిస్తామన్నారు. ఒకవేళ వర్షాలు పడి మేహాద్రి నీటి ప్రవాహం పెరిగితే ఎదురయ్యే ఇబ్బందులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమణలతో ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు వెళ్లేందుకు ఇబ్బందులను స్థానిక అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం గోపాలపట్నంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ప్రమాదకర పరిస్థితిని ఎమ్మెల్యే గణబాబు వివరించారు. అనంతరం పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. పరిస్థితి సానుకూలంగా ఉండే వరకు పునరావాస కేంద్రాల్లో ఉండాలని కోరారు. ఎవరికి ఏ ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రైతుల వితరణ



కూరగాయాల వాహనం వద్ద రైతులు



గోపాలపట్నం రైతు బజారులో రైతులుఅందించిన కాయగూరలు

విశాఖ విద్య: విజయవాడ వరద బాధితులకు మద్రిపాలెం రైతుబజార్‌లో దుకాణాలు నిర్వహించే రైతులు తమవంతు సాయంగా కూరగాయలు, ఇతర సామగ్రి అందజేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ పిలుపుమేరకు రైతుబజార్ ఈవో కొమ్మనాపల్లి వరహాలు చొరవ తీసుకొని వరదబాధితులకు సాయం అందించేలా దుకాణదారులతో చర్చించారు. విపత్తు సమయంలో తోటి వారిని ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంటుందని భావించిన రైతులు కూరగాయలు, ఇతర సరకులు అందజేశారు. వాటిని ప్రత్యేక వాహనంపై తీసుకెళ్లి మార్కెటింగ్ శాఖ కార్యాలయ అధికారులకు అప్పగించారు.

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విజయవాడలో ముంపు కారణంగా అక్కడి వారు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తమ వంతు సహకారాన్ని అదించేందుకు ముందుకు వచ్చారు. ఉల్లి పాయలు 50 కిలోలు, బంగాళ దుంపలు 100కిలోలు, బీట్‌రూట్ 38 కిలోలు, క్యాబేజీ39 కిలోలు, అరటి గెలలు6, ఆనప కాయలు 13 కిలోలు, వంకాయలు 13 కిలోలు, మునగ కాయలు 7కిలోలు, దొండకాయలు 50కిలోలు, బత్తాయిలు 25కిలోలు, క్యారెట్ 45 కిలోలు, కరివేపాకు 6కిలోల చొప్పున పంపించారు.

ఘనంగా సేవియర్ లూథరన్ చర్చి వార్షికోత్సవం

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వ వార్డు లక్ష్మీ నగర్ ఎఫ్ బ్లాక్‌లోని సేవియర్ లూథరన్ చర్చి 34 వ వార్షికోత్సవాన్ని సంఘ ఫేరిష్ పాస్టర్ రెవరెండ్ లంకపల్లి జాకబ్ రాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ డాక్టర్ శ్యామ్.జె.వేదాల హాజరై సంఘ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సండే స్కూల్ పిల్లలు,యూత్ సభ్యులు, మహిళలు, ప్రత్యేక గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ట్రెజరర్ నేతల శేఖర్, పీసీసీ మెంబర్స్ కె. జాన్ సుధాకర్, ఎస్పీ ప్రసన్న కుమార్, కొండా విజయ్‌కుమార్, జి. షాలెంరాజు, కోనాల కరుణ్ కుమార్ పాల్గొన్నారు.



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

అప్కోరా కమిటీ ఎన్నికల్లో బీఎంఎస్ విజయం

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని అశోకా పార్క్ పౌర నివాసితులు సంఘం (అప్కోరా)కు ఆదివారం జరిగిన ఎన్నికల్లో బీఎంఎస్ యూనియన్ బలపర్చిన ఓడ ప్యానల్ అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. తొమ్మిదికి తొమ్మిది స్థానాలను కైవసం చేసుకోడంతో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికలకు ముందే ట్యూనా బెహరా ఉపాధ్యక్షుడిగా, బినోద్‌కుమార్ మండల కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఏడు స్థానాలకు ఆదివారం ఎన్నికల అధికారి పరిపాలన భవనంలో ఎన్నికలు జరిగాయి. అనంతరం ఫలితాలు ప్రకటించగా ఓడ ప్యానల్‌కు చెందిన బీఎంఎస్ అభ్యర్థి జి.చిరంజీవి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 109 ఓట్ల భారీ మెజారిటీతో ప్రత్యర్థి హరిబాబుపై విజయం సాధించారు. కమిటీ కార్యదర్శిగా వై.పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సునీల్‌కుమార్‌లాల్, కోశాధికారిగా బి.అప్పారావు(భద్ర) అదే స్థాయిలో గెలుపొందారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎస్.ఎం.కె.సునీల్‌కుమార్, అనూప్ సింగ్, ఎస్.రామారావు విజయం సాధించారు. వీరంతా రెండేళ్ల పదవుల్లో ఉంటారు. విజయోత్సవ వేడుకల్లో గెలుపొందిన వారితో పాటు బీఎంఎస్ అనుబంధ ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం గుర్తింపు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా విద్యాసాగర్, ఎస్.రాజేష్, ఉపాధ్యక్షులు షణ్ముఖరావు, మెటీరియరిల్ ఆర్గనైజేషన్ జె.సి.ఎం ఫోర్త్ లెవెల్ సభ్యులు మోహనరావు విజేతలకు అభినందనలు తెలిపారు.



సంబరాలు చేసుకుంటున్న అప్కోరా నూతన కార్యవర్గ సభ్యులు

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటుదాం

మహారాణిపేట: 'స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం టీబీ ఆస్పత్రి కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి ఆస్పత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల వడగాల్పులు అధికమై వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం, ఆరోగ్యంపై పెను ప్రభావం తప్పదని హెచ్చరించారు. స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండని, దీని కోసం మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీశ్ ప్రసాద్, బాలాజీ, ఐ.మనోరమ, బి.మురళీకృష్ణ, గణాంక అధికారి మణికుమారి, మోహన్, ఇతర వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, సిబ్బంది